క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్ శిక్షణ

జమ్మలమడుగు : స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో భాగంగా ఉచిత కంప్యూటర్ శిక్షణను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రంథాలయాధికారి జింకా చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవి క్యాంపులో భాగంగా ఈనెల 19వ తేదీ నుంచి గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణను 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించనున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2023–24 సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ నవరూప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులలో ఖాళీగా ఉన్నాయని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారితోపాటు ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు జూన్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్, ఎస్ఎస్సీ, టీసీ, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, 2 ఫొటోలతో రావాలన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మగూడూరులో గురువారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు సచివాలయానికి వచ్చి విన్నవించుకోవచ్చునని.. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నివాళి

చెన్నూరు : స్థానిక బెస్తకాలనీకి చెందిన వైసీపీ నాయకుడు బోలా వెంకటశివ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం మృతుడి ఇంటికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండల నాయకులు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్ చీర్ల సురేష్‌యాదవ్, ఎం.సుబ్బారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరాజులు నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పరామర్శ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కదిరివారిపల్లె గ్రామానికి చెందిన రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏ రత్నంరాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

20న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో శ్రీపోలేరమ్మ తిరునాల సందర్భంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.75 వేలు, మూడవ బహుమతిగా రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.40 వేలు, ఐదవ బహుమతి రూ.30 వేలు, ఆరవ బహుమతి రూ.20 వేలు పోటీల్లో గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 7 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8384106188 నెంబరును సంప్రదించాలని కోరారు.

మహిళ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ లే ఔట్‌లో నివాసం ఉంటున్న కొప్పర్తి కుమరమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ శ్రీరామశ్రీనివాసులు, తమ సిబ్బందితో కలిసి బుధవారం అరెస్ట్ చేశారు. నిందితురాలి వద్ద నుంచి 28 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేసినట్లు సీఐ తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితురాలిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మహిళా పోలీస్ సిబ్బంది, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన పత్తి

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు గ్రామానికి చెందిన చెన్నుపల్లెరామిరెడ్డికి చెందిన సుమారు 20 క్వింటాళ్ళ పత్తి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయింది. రామిరెడ్డి తనకున్న 7 ఎకరాల పొలంలో పత్తిపంటను సాగు చేసి 6 నెలలుగా శ్రమించి కూలీలతో పత్తిని సేకరించి తన పొలంలో ఉన్న గోడౌన్‌లో నిల్వ ఉంచారు. బుధవారం సాయంత్రం వీచిన గాలికి గోడౌన్‌లోని విద్యుత్ బోర్డు షార్ట్‌సర్క్యూట్ జరిగి అక్కడే నిల్వ ఉన్న పత్తి మీద నిప్పురవ్వలు పడి అంటుకుంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గోడౌన్ నుండి పొగ వస్తుండటాన్ని గమనించిన చుట్టుపక్కల పొలాల వారు రామిరెడ్డికి తెలియజేయడంతో తోటి రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా పత్తి పొగసూచిగా మారడంతో మార్కెట్ చేసేందుకు పనికిరాకుండా పోయింది. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు రామిరెడ్డి వాపోయాడు.

'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- మండలంలో రెండో విడతలో 22 పాఠశాలలు ఎంపిక
- రెండో విడతలో మొత్తం రూ. 7.6 కోట్లు మంజూరు
- ఇప్పటి వరకు రూ.2.7 కోట్లు ఖర్చు



ఎర్రగుంట్లలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులను విరివిరిగా మంజూరు చేస్తూ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేకలను మారుస్తోంది. ఎర్రగుంట్ల మండలంలో నాడు-నేడు కార్యక్రమం కింద రెండో విడతలో 22 ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి రూ.7.6 కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇప్పటి వరకు రూ.2.7 కోట్లు ఖర్చు చేశారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఎర్రగుంట్ల : రాష్ట్రంలోని పేద పిల్లలకు మెరుగైన విద్య అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధి కోసం నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. దీనిద్వారా పాఠశాలలకు ప్రహరీ, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ పనులు, బెంచీలు, ఫ్లోరింగ్, వాటర్ ప్లాంట్ తదితర మౌలిక వసతులు కల్పిస్తూ, అవసరమైన చోట్ల అదనపు తరగతి గదులను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. గత ముఖ్యమంత్రులు ఎవరూ ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను పట్టించుకోలేదు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, బడుల రూపురేఖలు మార్చడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలైన తిప్పలూరు, పోట్లదుర్తి, నిడుజివ్వి, సున్నపురాళ్లపల్లి, దండుపల్లి, చిలంకూరు, కర్పుకుంటపల్లి, చిన్నదండ్లూరు, ఇల్లూరు, మేకలబాలయపల్లి, కేజీవిపల్లి, వై.కోడూరు, వలసపల్లి, ఎర్రగుంట్ల పట్టణంలో పలు పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సు . ధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను రెండోవిడతలో ఎంపిక చేయించి అదనపు తరగతి గదులను నిర్మిస్తుండటంతో పాటు గ్రానైటు రాళ్లతో ఫ్లోరింగ్ వేయించారు. మండలంలోని చాలా పాఠశాలల్లో పనులు వేగంగా చేయాలని అధికారులకు సూచించారు.

వేసవి సెలవలు ముగిసేలోపు పనుల పూర్తికి కృషి



మండల వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ పరిధిలో 22 పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేసవి సెలవలు ముగిసేలోపు పూర్తిచేయటానికి కృషి చేస్తున్నా ము. ఈ పనులన్నీ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీఎంసీ (తల్లిదండ్రులు కమిటీ) చైర్మన్, సభ్యుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. బడులు ప్రారంభించే నాటికల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయి.

– సుబ్బరావు, ఎంఈఓ, ఎర్రగుంట్ల

రేపు ఉచిత వైద్య శిబిరం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ ఈ శిబిరంలో గుండె నొప్పి/ఛాతి నొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెలో మంట కలగడం, ఛాతిలో బరువుగా ఉండటం, నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చోవడం, కాళ్లు వాపు రావడం, చమటలు పట్టడం వంటి జబ్బులు ఉన్న వారికి ఉచితంగా జీఆర్‌బీఎస్, బీపీ, ఇసీజీ, 2డి ఏకో పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గుండె సంబంధిత రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు మాస్క్ ధరించి రావాలన్నారు. మరిన్ని వివరాలకు 8886665620, 9100888057 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చెన్నూరు : మండల పరిధిలోని రామనపల్లి గ్రామ పంచాయతీ మొడాలు గ్రామానికి సమీపంలో ఉన్న స్మశాననానికి వెనుక వైపున బుధవారం జూద మాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారిన నుంచి రూ.2010 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దచెప్పలిలో రెండో రోజు సర్పంచ్ నామాల చంద్రలీలశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. మంచి నీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర సౌకర్యాలు కావాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెబుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాక ఇవ్వని అనేక పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

1902 డయల్ చేయండి...

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం... అనే కార్యక్రమాన్ని వినూత్నంగా ప్రారంభించిందని, 1902 కు డయల్ చేసి తమ సమస్యలు సీఎంకు వివరించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దచెప్పలి చిన్ని, నామాల శేఖర్, మద్రి సుబ్బన్న, చంద్రపాల్, చంటి, సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, హిదాయత్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, కొండారెడ్డి, ఆర్ వీఎస్ఆర్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం

చింతకొమ్మదిన్నె : 17వ డివిజన్ బుగ్గ అగ్రహారంలో ఏర్పాటు చేసిన గోశాలను బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దాదాపు రూ.36 లక్షలతో ఈ గోశాలను నిర్మించారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ కె. సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నగర కమిషనర్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ప్రవేశపరీక్షకు హాల్‌టికెట్లు సిద్ధం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంకు సంబంధించి ఈనెల 20న ప్రవేశపరీక్ష జరుగనున్నట్లు మైలవరం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు ఐడి నెంబర్ లేదా పుట్టిన తేదీ ఆధారంగా సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

ఎర్రగుంట్ల : స్థానిక రైల్వేస్టేషన్‌లో బుధవారం అనుమానంగా తిరుగుతున్న ఆంథోనిరెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి 27,750 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ బి.నాగర్జున తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైల్వే జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చౌడేశ్వరీ, డీఎస్పీ షేక్‌షా వారి ఆదేశాల మేరకు బుధవారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానంగా తిరుగుతున్న ఆంథోనిరెడ్డి బ్యాగ్‌ను తనిఖీ చేయగా మద్యం బాటిళ్లను పాండిచేరి నుంచి అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక సుగాలి కాలనీకి చెందిన బి.పాండునాయక్ అనే వృద్ధుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు

వైవీయూ : ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నిబంధనలు విరుద్ధంగా పాఠశాలలను నడుపుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ డీఈఓ వై.రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు.

- అదే విధంగా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న తొండూరు మండల పరిధిలోని ఓ స్కూల్ అసిస్టెంట్‌పై చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు డీఈఓ వై.రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు.
- నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా కళాశాల నిర్వహిస్తోందని ఏబీవీపీ నాయకులు ఆర్ఐఓ రమణరాజుకు ఫిర్యాదు చేశారు. ల్యాబ్‌లు, గ్రౌండ్, కనీస మౌలిక సదుపాయాలు లేవని ఏబీవీపీ నాయకులు మంజునాథరెడ్డి, వంశీకృష్ణ, హరి ఫిర్యాదు చేశారు.

గిరిజన అధ్యాపకులకు చోటు కల్పించాలి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం (ఏఐఎస్‌టీఏ) నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం వైవీయూలో వీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఐఎస్‌టీఏ నాయకులు మాట్లాడుతూ వైవీయూ పాలకమండలిలో ఎస్.టి. అధ్యాపకులకు అవకాశం కల్పించాలని కోరారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేకర్, సంయుక్త కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా పాలన



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ వివిధ విభాగాలకు 10 మంది ఉద్యోగులను ప్రభుత్వం నియమించిందన్నారు. అందువలన సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయన్నారు. మరోపక్క సంక్షేమ పథకాల వలన ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజలకు నేరుగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ పాలనపట్ల సంతృప్తిగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజలు చూపిస్తున్న ఆదరణను తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా నిరంతరం దుష్ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని రాబోయే రోజులలో వారికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులకు ఫోన్లు, లేఖల ద్వారా పరిష్కారానికి కృషి చేశారు.

కృత్రిమ గర్భధారణతో మేలురకం జాతి దూడల ఉత్పత్తి



మేలురకం జాతి దూడలను ప్రదర్శిస్తున్న పశువైద్యాధికారులు

చక్రాయపేట : పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా మేలురకం జాతి దూడలను ఉత్పత్తి చేసుకోవచ్చని పులివెందుల పశుసంవర్ధక శాఖ డీడీ శివప్రసాద్(ఇన్‌చార్జ్) తెలిపారు. బుధవారం మండలంలోని కుప్పగ్రామం చిన్నమోరయ్యగారిపల్లెలో చక్రాయపేట పశువైద్యాధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో మేలు రకం జాతికి చెందిన లేగదూడల ప్రదర్శన, అనారోగ్యంతో ఉన్న పశువుల కోసం పశువైద్య శిబిరంలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు తమ పశువులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సెమెన్(యద సూదులు)ద్వారా కృత్రిమగర్భదారణ చేయించడవల్ల మేలు రకానికి చెందిన దూడలు జన్మిస్తాయని తెలిపారు. వీటివల్ల రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. అనంతరం గ్రామంలోని లేగదూడలను ప్రదర్శించారు. మేలు రకం జాతి దూడలకు సంబంధించి సస్య రక్షణ చర్యల ద్వారా దూడలను పెంచిన రైతులకు బహుమతులను అందజేసి అనంతరం పశువులకు చికిత్సలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో కడప ఏపీఎల్ డీడీ డాక్టర్ రమేష్, వేంపల్లె ఏడీహెచ్ రవీంద్రనాథరెడ్డి, పశువైద్యులు డాక్టర్ సాదిక్‌బాషా, డాక్టర్ శివరామిరెడ్డిలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న జిల్లా అధికారిణి భువనేశ్వరి

పులివెందుల రూరల్ : నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చునని జిల్లా పరిశ్రమల అధికారిణి భువనేశ్వరి తెలిపారు. బుధవారం పులివెందులలో పులివెందుల, లింగాల, తొండూరు ఐటీఐ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీఐ కోర్సులు పూర్తైన తర్వాత ఇంజనీరింగ్ కోర్సులకు ఎంతో దోహదపడుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధి ఉంటే అవకాశాలు కూడా పొందవచ్చునన్నారు. పరిశ్రమలు ఎలా స్థాపించాలనే దానిపై అవగాహన కల్పించారు. స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా దేశంలో 33 శాతం యువత ఉన్నారన్నారు. యువత కోసం ప్రభుత్వ విద్యా సంస్థలలో భాగమైన వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చి.. దీని ద్వారా యువత చెడు మార్గంలో పయనించకుండా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ రాజగోపాల్, రామ్మూర్తి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి సామగ్రి వితరణ



వైద్యులకు సామగ్రి పరికరాలను అందజేస్తున్న హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ మేనేజర్లు

చెన్నూరు : చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు రూ.12.50 లక్షల విలువ కలిగిన సామగ్రిని వితరణ చేసినట్లు సామాజిక కేంద్ర వైద్యులు డాక్టర్. సతీష్‌కుమార్, డాక్టర్ దినకర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోకి వచ్చే ప్రజలకు, రోగులకు ఐసీయూ బెడ్లు–5, వీల్ చైర్స్–5, ఇనుస్ట్రుమెంట్ ట్యాలీలు–10, ఈసీజీ పరికరాలు–2, డెలివరీ బెడ్–1, ఎల్ఈడీ ఓటీ లైట్–1 ఇవ్వడం జరిగిందన్నారు. వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్లు టీ.ఓబయ్య, నాగార్జునరావు, వైద్యులు సాగరకుమారి, రామ్మూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ



విద్యార్థులచే పేపర్‌తో బొమ్మలను తయారు చేయిస్తున్న ఆర్పీ హరిత



కమలాపురం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్న లైబ్రేరియన్ నాగాంజలి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు రీసోర్స్ పర్సన్ హరిత పుస్తక పఠనం, కథలు చెప్పడం, పేపర్ క్రాఫ్ట్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పేపర్‌తో బొమ్మలు ఎలా చేయాలో చేసి చూపించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వేసవిలో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవరచు కోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో శిక్షణ నిచ్చారు.

వడ దెబ్బకు ఎద్దు మృతి



వడ దెబ్బతో మృతి చెందిన ఎద్దు

వేంపల్లె : స్థానిక క్రిష్టియన్ కాలనీకి చెందిన పుల్లయ్య గ్రామంలో ఒంటెద్దు బండిని నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ఈ క్రమంలో రోజు మాదిరిగా బుధవారం తన పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో ఉన్నట్లుండి ఎద్దు కుప్పకూలింది. వెంటనే పశువైద్యాధికారిని పిలుచుకుని ఇంటికి రాగా అప్పటికే ఎద్దు మృతి చెందింది. వడ దెబ్బతో ఎద్దు మృతి చెందిందని వైద్యులు తెలిపారు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలం టూ పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

నిరంతర నిఘాతో నేరాలకు అడ్డుకట్ట

– కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్

కడప అర్బన్ : నేరాలు జరుగకుండా పోలీసుశాఖ ఎప్పటికపుడు అప్రమత్తంగా ఉండాలని... నిఘాతో నేరాలకు అడ్డుకట్ట వేయగలమని కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పేర్కొన్నారు.

కడప డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి పోలీస్ కమాండ్ కంట్రోల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో కమాండ్ కంట్రోల్ సిబ్బంది విధుల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదనీ నిరంతరంగా పర్యవేక్షిస్తూనే ఉండాలనీ తెలిపారు. పోలీస్‌శాఖ గస్తీ ద్వారా చేపట్టిన చర్యలతోనే ఎలాంటి నేరాలు జరుగకుండా ప్రజలు భరోసాతో ఉండగలరని తెలిపారు. ఎటువంటి సమాచారాన్ని అయినా కూడా వెంటనే పోలీస్‌స్టేషన్‌లకు అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల భాగస్వామ్యాన్ని తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సబ్‌జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన క్రీడాపాఠశాల క్రీడాకారులు



ఏపీ వాలీబాల్ జట్టులో జిల్లా క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం చందర్ నగర్‌లో నిర్వహించనున్న 45వ సబ్‌జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 13, 14 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టులో చోటు సంపాదించారు. కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాలకు చెందిన టి. పావని, ఎస్. గాయత్రి, ఎస్. రుచిత, జి.శ్రీలక్ష్మి, జె.కుముదినిదేవి బాలికల జట్టుకు ఎంపికకాగా, రాజంపేటకు చెందిన సాయిప్రతాప్ బాలుర విభాగంలో ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెల18 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్యాంపులో పాల్గొనాల్సి ఉంటుందని జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి ఖాదర్‌వల్లి పేర్కొన్నారు.

హాకీ సబ్‌జూనియర్ నేషనల్స్‌కు...

ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్‌జూనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌కు కడప క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాల నుంచి ఏకంగా 5గురు ఎంపిక కావడం విశేషం. క్రీడాపాఠశాలకు చెందిన క్రీడాకారులు కె.చరణ్‌కుమార్, జి.చందు, ఎం.శ్రీనివాస్, ఎస్.మహమ్మద్, డి. దేవసాయియాదవ్‌లు ఎంపికయ్యారు.